తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

దిగువ కైరాడ గ్రామంలో బోరు వేసి గిరిజనులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు అధికారులను డిమాండ్ చేశారు. శనివారం మండలంలో మొండెంఖల్ పంచాయతీలో దిగువ కైరాడ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. వర్షాలు పడినప్పుడు నీరు తేవడానికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందించినా స్పందనలేదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే సచివాలయ, మండల కేంద్రాల్లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బిడ్డక ఎరుగో, బిడ్డక తురకన్నా, పి.మణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల దారిలో రహదారి కుదుపులు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఇవి ఓట్ల రూపంలో ఆ పార్టీకి నష్టం చేకూర్చే ప్రమాదం కూడా కనిపిస్తోంది. తాజాగా రాజాం నియోజకవర్గంలో జరిగిన సంఘటన విజయనగరం ఉమ్మడి జిల్లాలో రహదారి సమస్యలు మరోసారి తెరపైకి వచ్చాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనేది జనం నుంచి వినిపిస్తున్న మాట. అందుకు తగ్గట్టే జిల్లాలోని రహదారులు కూడా అధ్వానంగా ఉన్నాయి.

- రాజాంలో స్థానిక ఎమ్మెల్యే నిలదీత
- కురుపాంలో నిత్యం నిరసనలే
- కొత్తవలసలో యథావిధి
- దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇవే సమస్యలు
- నిరాశ, అసహనంతో ప్రజానీకం

రాజాంలో ఎమ్మెల్యేను నిలదీస్తున్న స్థానికులు

వైసిపికి రహదారి కుదుపులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాజాం - డోలపేట మధ్య రహదారి అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి చినుకులు పడినా వాహనాలే కాదు, కాలినడకకు కూడా ఆటంకంగా మారుతోంది. అనేక సార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇదే రహదారిలో చెరకు లోడుతో సంకిలి వెళ్తున్న లారీ కూరుకుపోయింది. ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులను ప్రజానీకం చుట్టుముట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి వెంటనే వెళ్లకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడంతో ఆయన ద్విచక్ర వాహనంపై వెళ్లాల్సివచ్చింది. దీంతో పాటు రాజాం పట్టణంలోని రహదారి విస్తరణ పనులపైనా జనం ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా అంబేద్కర్ కూడలి నుంచి జిఎంఆర్ ఐటి ప్రాంగణం వరకు, బొబ్బిలి రహదారి జంక్షన్ నుంచి గాయిత్రీ కాలనీవరకు రహదారి విస్తరణ పనులు చేపట్టాలని చాలా కాలం క్రితమే నిర్ణయించారు. రూ.20కోట్లతో తలపెట్టిన ఈ పనులకు జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన కూడా చేశారు. తీరా ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో, రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అటు మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గంలో కొమరాడ - రాయగడ రోడ్డు కూడా వర్షాకాలంలో చెరువులను తలపిస్తోంది. రహదారిపై పొడవునా ఉన్న గ్రామాల ప్రజానీకం సిపిఎం ఆధ్వర్యాన నిత్యం నిరసన కార్యక్రమాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఓ సందర్భంలో రహదారిపై ఉబాలు పట్టి వరినాట్లు వేసినా పాలకుల్లో చలనం రాలేదు. దీంతో, ఈ రహదారిలో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి.

ఎస్.కోట నియోజకవర్గం కొత్తవలస మండల కేంద్రంలో మూడు రోడ్ల జంక్షన్ గుంతల మయంగా మారింది. వర్షాలు పడినప్పుడు నీరు చేరడంతోపాటు మిగిలిన సమయంలో దుమ్ముదూళితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీన్ని బాగు చేయాలంటూ ఇటీవల సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు ధర్నా కూడా చేపట్టారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో రహదారులపై చూపిన నిర్లక్ష్యం వైసిపి వచ్చే ఎన్నికల్లో గట్టి దెబ్బతగిలే అవకాశం ఉందని పలువురు చర్చించు కుంటున్నారు.

వేపాడ మండలంలో సోంపురం జంక్షన్ నుంచి ఆనందపురం కూడలి వరకు 16కిలోమీటర్ల రోడ్డు పనులు ప్రారంభించి ఏళ్ల గడుస్తున్నా పూర్తి చేయలేదు. ఈ రహదారిలో క్వారీ లారీలు అధిక లోడుతో తిరగడం వల్ల రోడ్డు నిర్మాణానికి వేసిన మెటల్ తేలిపోతోంది. వీలుపర్తి రోడ్డు నుంచి కడకొండకు సుమారు కిలోమీటరు వరకు వేసిన పక్కా రోడ్డు బూడిదగా మారిపోయింది. నిధులు మంజూరైనట్లు చెప్పడమే తప్ప పనులు మాత్రం చేపట్టకపోవడంతో గిరిజన గ్రామాల ప్రజలకు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇదే మండల ప్రధాన రహదారి నుంచి ఆతవ గ్రామానికి వెళ్లే రెండు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఎమ్మెల్యే గ్రాంట్ నుంచి నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్టరు పని ప్రారంభించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పని నిలిపివేశారు. విశాఖపట్నం నుంచి శృంగవరపుకోట మీదుగా అరకు వెళ్లే హైవే నుంచి ముకుందపురం గ్రామానికి ఉన్న సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర రోడ్డు గోతులమయమైంది. ప్రమాదకరంగా గోతులు ఏర్పడటంతో ఈ రోడ్డుపై ప్రయాణించడానికి ముకుందపురం, ఓబులయ్యపాలెం గ్రామస్తులు భయపడుతున్నారు.

కొమరాడ మండలంలో రోడ్లు బాగుచేయాలని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు(ఫైల్)

గజపతినగరం నియోజకవర్గంలోని గజపతినగరం, లోగిశ రోడ్డు కూడా చాలా కాలంగా అధ్వానంగా ఉంది. ఈ రహదారికి నిధులు మంజూరైన ప్పటికీ పనులు నత్తనడకన సాగడంతో ప్రజా ప్రతినిధులపైనా, అధికారులపైనా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

రూరల్ పోలీసుస్టేషను భవన ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

శాంతి భద్రతల రక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర తెలిపారు. పట్టణంలోని మక్కువ రోడ్డులో రూ.2.5 కోట్లతో నూతనంగా నిర్మించిన రూరల్ పోలీసు స్టేషను భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు పనిచేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుటకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూరల్ పోలీసు స్టేషను నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అన్ని సదుపాయాలతో ఎపి స్టేట్ పోలీసు హౌసింగు కార్పొరేషను వారితో రూ.2.50 కోట్లతో పోలీసు స్టేషను నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధికి రోడ్ల నిర్మాణం చాలా అవసరమని, దానికి రోడ్లు, భవనాల శాఖతో పాటు పోలీసు శాఖ సహకారం కూడా చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కలెక్టరు నిశాంత్‌కుమార్, డిఐజి ఎస్.హరికష్ణ, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, దిశ డిఎస్‌పి హర్షిత, డిఎస్‌పి శేషాద్రి, పోలీసు హౌసింగు కార్పొరేషను ఇఇ కె.తమ్మిరెడ్డి, డిఇ వి.వెంకటరెడ్డి, సిఐ ఎస్.ధనుంజయరావు, స్టేషను ఇన్‌ఛార్జి మురళి, ఎస్.ఐ. ప్రయోగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ పోలీసుస్టేషను భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పట్టణంలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కమిషనర్ జె.రామ అప్పలనాయుడు వెల్లడించారు. పట్టణంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తోటపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న ఇన్‌ఫిల్ట్రేషన్ బావులకు వెళ్లే నీటి ప్రవాహాన్నిశనివారం మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్, ఎఇ ఆనంద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తోటపల్లి రిజర్వాయర్ గేట్ల ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు సిబ్బంది మూసివేయడంతో ఇన్‌ఫిల్ట్రేషన్ బావులకు నీటి సరఫరా కావడం లేదన్నారు. దీంతో పట్టణానికి తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఇరిగేషన్ ఇఇతో మాట్లాడామని, రెండు అడుగుల మేరకు రిజర్వాయర్ గేట్‌ను పైకి ఎత్తుతారని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా రిజర్వాయర్ నుండి నీటి ప్రవాహాన్ని ఇన్‌ఫిల్ట్రేషన్ బావులకు మళ్లించేందుకు గ్యాలరీ పైప్‌లైన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి, కౌన్సిల్ ఆమోదంతో టెండర్ పిలిచి, పనులు ప్రారంభించి, పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరందిస్తామని వివరించారు.

ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను పరిశీలిస్తున్న కమిషనర్ రామఅప్పలనాయుడు

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న అప్పిరెడ్డి, పుష్పశ్రీవాణి, తదితరులు

29న కురుపాంలో వైసిపి బస్సుయాత్ర

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 29న కురుపాంలోని మేదరవీధి జంక్షన్ వద్ద వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తెలిపారు. శనివారం కురుపాంలోని మేదర వీధి జంక్షన్‌లో సభా స్థలాన్ని సాధికార బస్సుయాత్ర ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి ఎల్.అప్పిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నవరత్నాలు వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

భూపట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం పేదలకు ఎమ్మెల్యే జోగారావు భూపట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న అసైన్డ్ ల్యాండ్ వారికే కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, తహశీల్దార్ ఎంవి రమణ, వైసిపి నాయకులు ఆర్‌వి పార్థసారథి, ఎంపిటిసి గురుడి కుసుమ, సూర్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒలు శ్రీనివాసరావు, శ్రీకాంత్, మోహిని పాల్గొన్నారు.

వైద్య కళాశాల ఏర్పాటు చేయాల్సిందే

- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి
- రెండో రోజుకు ఎస్ఎఫ్ఐ దీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో ప్రభుత్వ వైద్య కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరసన దీక్షలు శనివారం రెండోరోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఎం.కృష్ణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం భౌగోళికంగా చాలా విశాలమైన ప్రాంతమని, అనేక వనరులకు పుట్టినిల్లుగా ఉన్నప్పటికీ పేదలకు అత్యవసర వైద్య సదుపాయం అందుబాటులో లేకపోవడం చాలా దారుణమన్నారు. ఎన్నో ఏళ్లుగా సుదూర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం వల్ల మరణిస్తున్నారంటే దానికి కారణం జిల్లాలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడమేనని తెలిపారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రక్త నిల్వ కేంద్రం కేటాయించకపోవడం చాలా అన్యాయమని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో పార్వతీపురంలో మెడికల్ కళాశాల నిర్మించడం వల్ల ప్రభుత్వ వైద్యం మెరుగుపడుతుందని చెప్పారు. పాలకులు చిత్తశుద్ధితో కళాశాలకు సరిపడా స్థలం కేటాయించి, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని, కచ్చితంగా ప్రభుత్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాటానికి రైతు సంఘం నుండి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ జిల్లా విద్యార్థులకు ఉపాధి పొందేందుకు అవకాశాలు లేకపోవడంతో చదువులు మధ్యలోనే ఆపివేసి, వలస బాట పడుతున్నారని తెలిపారు. వెంటనే జిల్లాలో మూసివేసిన పరిశ్రమలు తెరిపించి, నూతన పరిశ్రమలు నిర్మించి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్, సహాయ కార్యదర్శి కె.రాజు, అఖిల్, రవి, సిసింద్రీ, తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ఫ్లైఓవర్‌పైకి మెట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ రైల్వే స్టేషన్ నుంచి కొత్తవలస వైపు ఉన్న ఫ్లైఓవర్ పైకి వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మెట్లను ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికులు ఫ్లైఓవర్‌పైకి చేరేందుకు పడుతున్న ఇబ్బందులను వారు పరిశీలించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సుల కోసం చుట్టూ తిరిగి ఫ్లైఓవర్ పైకి రావాల్సి వస్తోందన్నారు. ఫ్లై ఓవర్ కింద దక్షిణ రోడ్డు వెడల్పు చేయాలన్నారు. ఫ్లైఓవర్‌కు రైల్వే ప్లాట్‌ఫాం నుంచి మెట్లు నిర్మించాలని కోరారు. కొత్తవలస వంతెన డౌన్‌లో బస్సు సెల్టర్ నిర్మించాలన్నారు.

ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న జెసి గోవిందరావు, ఎమ్మెల్యే జోగారావు, ఎమ్మెల్సీ రఘువర్మ

ఆర్చరీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని జోగుంపేట గురుకుల పాఠశాల ఆవరణలో 67వ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, ఎమ్మెల్యే ఎ.జోగారావు, డిఇఒ పి.ప్రేమ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విలువిద్య గొప్ప ఆటని, ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, ఎంపిపి బి.రమణమ్మ శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, ఎంపిటిసి సిహెచ్ జగదీశ్వరరావు, సర్పంచ్ కె.సింహాచలం, ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు డి.గాంధీ, ఎస్.మురళి, ఎస్.శ్రీనివాసరావు, పి.వాసుదేవరావు పాల్గొన్నారు

తోటపల్లికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కార్తీకమాసం రెండో శనివారం సందర్భంగా మండలంలో తోటపల్లి ఆలయానికి జనం పోటెత్తారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఇఒ వి.వి.సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు జి.సింహాచలంనాయుడు, కుసుమూరు సాగర్, గౌరీశంకర్ పాత్రో పాల్గొన్నారు.

జీడితోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

ఒడిశాలోకి గజరాజుల గుంపు

ప్రజాశక్తి -భామిని

నెల రోజులుగా భామిని మండలంలో ఇసుకగూడ, సన్నాయిగూడ, కాజీపురం, మూలగూడ, పసుకుడి, లివిరి ప్రాంతాలలో సంచరించిన నాలుగు ఏనుగుల గుంపు ఒడిశా సరిహద్దుకు చేరింది. శనివారం వంశధార నదిని దాటి ఒడిశాలో కాసినగర్ బ్లాక్, బుదరా పంచాయతీ, వన్నా గ్రామ పరిసర జీడి తోటల్లో ఏనుగులు తిష్టవేశాయి. వారం రోజులుగా పసుకుడి, లివిరి, పసుకుడి గ్రామాల్లో సంచరించిన ఏనుగులు.. ప్రస్తుతం నది దాటి ఒడిశాలోకి ప్రవేశించాయి. ఒడిశా వెళ్లడంతో స్థానిక వ్యవసాయ దారులు తాత్కాలిక ఉపశమనంగా భావిస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలలో పిఒ తనిఖీలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేగిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వండి పెడుతున్న వంటకాలను స్వయంగా పరిశీలించారు. మెనూ అమలు చేస్తున్నారా? ప్రతిరోజూ పెడుతున్న వంటకాలు రుచికరంగా ఉంటున్నాయా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు వచ్చి పాఠ్యాంశాలను బోధిస్తున్నారా? లేదా అని ఆరాతీశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన పాఠశాల స్టోర్‌రూమ్, రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్‌పై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న అటల్ టింకరింగ్ లేబ్‌ను పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. అనంతరం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజూ ఎంత మంది రోగులు వచ్చి వైద్యాన్ని పొందుతున్నారో? అని అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. మందులు సకాలంలో వస్తున్నాయా? లేదా అని ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

మౌనం వెనుక మర్మమేమిటో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మౌనం అర్ధ అంగీకారం అంటారు పెద్దలు. మేధావులు, ప్రజాప్రతినిధుల మౌనం సమాజానికి చేటని కూడా మరికొంతమంది చెబుతుంటారు. తాజాగా అటువంటి సూక్తులు, నీతి వాక్యాలే గుర్తు చేస్తున్నారు జిల్లా ప్రజానీకం. అపరిచిత వ్యక్తి ప్రభుత్వ పథకాలపై సమీక్షలు చేస్తుంటే జిల్లా ఉన్నతాధికారిగానీ, ప్రజాప్రతినిధులు గానీ నోరు మెదపకపోవడం వెనుక మర్మమేమిటో? అన్నది పబ్లిక్ టాక్. ఈనెల 21, 22 తేదీల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ అపరిచత వ్యక్తి క్షేత్ర స్థాయి పరిశీలనకు రావడంతోపాటు ప్రభుత్వ పథకాలపై సమీక్ష చేసిన సంగతి తెలిసిందే. ఉపాధి హామీ పనులు చేపట్టిన మట్టి పనులు మొదలుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాలు, ఏజెన్సీలో చెక్‌డ్యాంల నిర్మాణ అవసరాల వరకు ఆరా తీయడం, రెండో రోజు పార్వతీపురం జిల్లా పర్యటన ముందుగా అనుకున్న షెడ్యూల్ మార్పుచేయడం, మీడియా కంటపడకుండా జాగ్రత్తలు వహించడం, ఇందుకు అధికారులు కూడా సహకరించడం చర్చనీయాంశంగా మారింది. మమూలుగా ఆలోచిస్తే ఎవరో జిల్లాలకు వచ్చి వెళ్లారని భావించవచ్చుని, ఆ అపరిచిత వ్యక్తి అధికారిక సమీక్షలు, ఆపై అత్యంత గోప్యత ప్రదర్శించడం వెనుక ఏదో ఎవరి ప్రమేయమో ఉండే ఉంటుందని జనం చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారం నడిచి నాలుగు రోజులు కావచ్చినా జిల్లా సర్వోన్నత అధికారిగానీ, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులుగానీ స్పందించకపోవం పట్ల జనం విస్తుపోతున్నారు. చివరకు డ్వామా పీడీ కూడా నోరు మెదపడం లేదు. అపరిచిత, అనధికార పర్యవేక్షణపై తీగలాగితే.... డొంక కదిలిన చందంగా బయటపడుతుంది. కానీ, ఆ తీగ లాగేందుకు ఎందుకు సాహించడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకుందంటూ కొందరు తలలు పట్టుకుంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు తెలియకుండా రాష్ట్ర స్థాయి అధికారులెవరైనా ఇటువంటి నాటకానికి తెరలేపారా? అన్న సందేహాలు, ఊహాగానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. ఈనేపథ్యంలో ఆ అపరిచత వ్యక్తి పరిశీలించిన అమృత్ సరోవర, మొక్కలు పెంపకం, ఏజెన్సీలో చెక్‌డ్యామ్‌ల మంజూరు, నిర్మాణాల పట్ల జనమే ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరముందని జనం చర్చించుకుంటున్నారు. చెప్పినట్టుగా చేయలేకపోతేనే సంబంధిత అధికారులు, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీచేస్తున్న ఉన్నతాధికారులు దీనిపై ఎందుకు స్పందించడం లేదన్నది సాక్షాత్తు కొంతమంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నోట వినిపిస్తున్న మాట. దీన్ని ఇలాగే వదిలేస్తే అజ్ఞాత నాటకంలో అపరిచితుల పెత్తనం పెచ్చుమీరుపోయే ప్రమాదం లేకపోలేదని కూడా చర్చనడుస్తోంది. ఈ వ్యవహారం ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి దృష్టిలో ఉండకపోవచ్చు. తెలిస్తే సంబంధిత వ్యక్తులకు తాట తీసినంత పనే చేస్తారని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ ఇప్పుడు స్పందించకపోతే, ఎప్పటికైనా నాటకీయ పరిణామాలు బయటపడతాయని పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ఎంఇఒ సూర్యచంద్రరావుకు వినతి పత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఎంఇఒకు సమ్మె నోటీస్

ప్రజాశక్తి-సీతంపేట

సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒ సూర్యచంద్ర రావుకు సమ్మె నోటీసు అందించారు. క్రమబద్ధీకరణ, ఉద్యోగభద్రత, తదితర డిమాండ్లపై డిసెంబరు 20 నుంచి సమ్మె చేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నిమ్మక శ్రీనివాసరావు, రూప, డి.చక్రధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ ప్రక్రియలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నంలో జెకె క్రెడాయ్ సంస్థ మరో అడుగు ముందుకు వేసింది. ప్రాపర్టీ ఎక్స్‌పో పేరిట నగరంలోని లీ పారడైజ్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు భారీ ప్రదర్శనను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిందని క్రెడాయ్ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ వెల్లడించారు. శనివారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించాఉ ప్రతిఏటా ప్రాపర్టీ ఎక్స్ పో పేరిట ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 250 వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. 75 మంది భవన నిర్మాణ సంస్థలకు చెందిన ప్రతినిధులు, బ్యాంకర్లు పాల్గొంటున్నారని చెప్పారు. కొత్తగా ఇల్లు నిర్మించుకొనే వారు తాము ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనకు వచ్చినట్లయితే భవన నిర్మాణాలపై సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు. నూతన విధానాలలో భవన నిర్మాణాలు, సామగ్రి కొనుగోలుకు అవకాశం ఉంటుందన్నారు. నగర ప్రజలందరూ ప్రాపర్టీ ఎక్స్ పో కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో క్రిడయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా వ్యాప్తంగా న్యాయ మూర్తులతో శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన వర్కుషాప్‌నకు హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, యు.దుర్గాప్రసాద్‌ను పలువురు న్యాయవాదులు కలిసి సత్కరించారు. ప్రత్యామ్నాయ నూతన కోర్టు భవన సముదాయాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో న్యాయ వాదుల సంఘ కార్యవర్గ సభ్యులు సిహెచ్ దామోదర రావు, విజి సంతోష్ ,అంజని కుమార్ , సీనియర్ న్యాయ వాదులు కెవియన్ తమ్మన్న శెట్టి, బొడ్డు సత్య నారాయణ, ఇనుగంటి సురేష్, ధవళ వెంకట రావు, బివిఆర్‌కె ప్రసాద్, కె.సూర్య ప్రకాష్ తదితరులు ఉన్నారు.

కోలగట్లకు అభినందనలు

శిల్పారామం నుండి కోర్టుకు చేరుకోవడానికి రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్లను న్యాయవాదులు అభినందించారు.

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ

ప్రజాశక్తి-సీతంపేట

బోగస్ ధ్రువపత్రాలకు సంబంధించిన కేసులను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి శనివారం విచారించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు, కేసులను ఎదుర్కొంటున్న వారిని విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి మంగవేణి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పట్నాన సత్యన్నారాయణ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ (పరుగుల) పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. సత్యనారాయణ విజయనగరం రాజీవ్ గాంధీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని శ్రీరాములు తెలిపారు. ఎంపికైన క్రీడాకారుడును పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఉప ప్రదానోపాద్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ లోకిరెడ్డి కృష్ణ, రహీం షేక్ లాల్, పొట్నూరు శివాజీ, సబ్బావరపు సతీష్, తమ్మినేని రాజేష్ తదితరులు అభినందించారు.

ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-సీతంపేట

ఆరోగ్యశ్రీ పథకంపై ఆసుపత్రులకు వచ్చే రోగులకు అవగాహన కల్పించాలని ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్లు అప్పారావు, ప్రకాశ్ తెలిపారు. శనివారం వివిధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే గిరిజనులకు ఆరోగ్య శ్రీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సక్రమంగా ప్రభుత్వ కార్యక్రమాలు

ప్రజాశక్తి-సీతంపేట

అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా సాగేటట్లు ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. స్థానిక వైకెపి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. సంబంధిత కార్యక్రమాలు జరిగేటప్పుడు రిపోర్టు ఫొటోలు నిర్ణీత సమయంలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి కె.సత్యం కార్యదర్శులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఆవరణలో హరితహారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో హరితహారం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటలని, పచ్చదనం పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు డి.రామయ్య, త్రినాథ పాల్గొన్నారు.

అభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

అభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. సామాజిక సాధికార బస్సుయాత్రలో ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. బస్సుయాత్ర వైసిపి కార్యక్రమమైనప్పటికి ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. బొబ్బిలిలో జరిగిన బస్సుయాత్ర సభ విఫలమైందని విమర్శించారు.ఆయనతో జనసేన నాయకులు ఎస్.గంగాధర్, పి.రాజు ఉన్నారు.

సకాలంలో సరుకులు అందజేయాలి

బొబ్బిలిరూరల్ : లబ్దిదార్లకు సకాలంలో సరుకులు అందజేయాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో డీలర్లు, డియంఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లంతా సకాలంలో సరుకులు తీసుకొని డియంఎ ఆపరేటర్లకు అందజేయాలని వారంతా సకాలంలో సరుకుల లబ్ది దార్లకు పంపిణీ చేయాలని సూచించారు. డీలర్లు, యండిఎ ఆపరేటర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఎస్‌డిటి ఆర్.సాయికృష్ణ, డీలర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం

జెసి గోవిందరావు • జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-పార్వతీపురం

సమాజాంలో లింగవివక్ష ఉండకూడదని, పూర్తిగా నిర్మూలించాలని జాయింట్ కలెక్టర్ గోవిందరావు కోరారు. మహిళలపై గృహ హింసను నిరోధించుటకు గృహ హింస చట్టంపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఆర్‌సిఎం జిల్లా క్యార్యాలయ సముదాయం నుంచి చేపట్టిన ర్యాలీని జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో విజయం సాధిస్తున్నారని తెలిపారు. చట్టం పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించిందని, వాటిని సమర్ధవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఇంటిలో, పనిప్రదేశాల్లో మహిళలను గౌరవించాలని, వారి హక్కులను కాపాడాలని తెలిపారు. మహిళల హక్కులను కాపాడేందుకు రూపొందించిన గృహహింస చట్టాలపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, మున్సిపల్ కమిషనరు రామప్పలనాయుడు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండల కేంద్రంలో గృహ హింస చట్టంపై అవగాహన ర్యాలీని వైకెపి, ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.వెంకట జనార్ధన్, సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎపిఎం పెదిరెడ్ల అప్ప నాయుడు, సిసిలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, కింజంగి కృష్ణ, వి.లక్ష్మణరావు, చింతాడ ప్రసాద్, కొప్పర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఎపిఎం ఆర్.శ్రీరాములనాయుడు ఆధ్వర్యంలో వైకెపి కార్యాలయం నుంచి హనుమాన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసిలు కోటేశ్వరరావు, ఆనందరావు, ప్రసాద్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కురుపాం : వైకెపి కార్యాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులతో ఎపిఎం ఇవి కిశోర్ లింగవివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసిలు శ్రీను, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : వైకెపి కార్యాలయం నుంచి మండల కేంద్రం వరకు మహిళా హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రమేష్, ఎపిఎం వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, మహిళా సంఘాల సభ్యులు

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం కెజిబివి విద్యార్థులు లింగవివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎపిఎం ఆదయ్య, ప్రిన్సిపల్ శ్రీరంజని, సిసిలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మహిళలపై దాడులు ఆపాలని మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, ఎపిఎం బి.శివున్నాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు పి.సుజాత, రైతు ఉత్పత్తిదారుల సంఘం సిసి వై.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : లింగ వివక్షకు వ్యతిరేకంగా పాచిపెంట మండల కేంద్రంలో వైకెపి, మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో శనివారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నుండి స్థానిక దళిత కాలనీ వరకు మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయ కుమార్, సిసిలు పాల్గొన్నారు.

మక్కువ : మండల కేంద్రంలో లింగవివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సూర్యనారాయణ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో మానవహారం నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు ; పాచిపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మహాధర్నా విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-సీతానగరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 27, 28వ తేదీల్లో విజయవాడలో చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు కోరారు. శనివారం సీతానగరంలో మహాధర్నా విజయవంతానికి సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 500 రైతు సంఘాలకు నాయకత్వం వహిస్తున్న అఖిల భారత కిసాన్ సంయుక్త మోర్చా, అఖిలభారత కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు మహాధర్నా చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, గ్రీన్ అంబాసిడర్ నాయుకులు జలుమూరు గౌరి, బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయుకులు రెడ్డి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మహాధర్నాను విజయవంతం చేయాలని మండలంలోని అజ్జాడలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ నాయకులు టి.శంకరరావు కోరారు. మహాధర్నా కరపత్రాలను నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.వెంకటరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

కొమరాడ : ఈ నెల 27, 28వ తేదీలలో విజయవాడలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. కూనేరు సంతలో మహా ధర్నాను జయప్రదం చేయాలని శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ప్రసాదు, బాబూరావు, రాజు, లక్ష్మణరావు, వెంకట్రావు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు ; బలిజిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

వైసిపి నాయకులతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-బలిజిపేట

అర్హులైన ప్రతిఒక్కరి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం మండలంలో అరసాడ, పెదమాయవలస, నారాయణపురం, రావివలస గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమాల అమలు, వాటి ఉపయోగం తదితర అంశాలపై పార్టీ నాయకులతో, ఆయా గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరసాడ గ్రామంలో ఎంపిటిసి గుల్ల ప్రభావతి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీలను శత శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 11,800 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 11 వేలు బిఎల్‌సి ఇళ్లు, 800 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, వాటి ఉపయోగాలపై ఇదివరకే నియోజకవర్గ స్థాయిలో మొదటి విడత అవగాహన కల్పించామన్నారు. రెండో విడతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుల్ల రాజు, కె.పాపినాయుడు, జగదీష్, డి.వెంకటనాయుడు, కె.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గంటేడ గౌరునాయుడు, ఎంవిఆర్ కృష్ణాజీ, తదితరులు

విద్యార్థులు ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పార్వతీపురం ఎస్‌వి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించినప్పుడే బతుకులు బాగుపడతాయని తెలిపారు. సామాన్యులకు, పేదలకు నేటికీ రాజ్యాంగ, స్వాతంత్ర్య ఫలాలు అందడం లేదని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక మార్పుకోసం కృషి చేయాలని కోరారు. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ చలపతిరావు మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పనకు సంబంధించిన విషయాలు వివరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రంజిత్ కుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని, రక్షించుకునేందుకు విద్యార్థులు, యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా డాక్టర్ బ్రహ్మారెడ్డి రచించిన 'భారత ప్రజలమైన మేము ఈ దేశానికి యజమానులం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేదిక జిల్లా కార్యదర్శి డి.చంద్ర మౌళి అధ్యక్షతన జరిగిన సదస్సులో సభ్యులు డి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛను పెంపొందించుకోవాలి

సీతంపేట : స్వేచ్ఛను పెంపొందించుకోవాలని ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపిటిసి సభ్యులతో భారత సంవిధాన ప్రస్తావనను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, పిఆర్ జెఇ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పాలకొండ

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు హిమప్రభ

అంగన్వాడీల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హిమప్రభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ విస్తృత స్థాయి సమావేశాన్ని ప్రాజెక్టు అధ్యక్షులు జి.జెస్సీబాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీల మూడు నెలల వేతన బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీతంపేట ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు బి.పార్వతి, ఎ.దర్శమ్మి, సెక్టార్ లీడర్లు కె.శారద, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 'వట్టిగెడ్డ'కు మరమ్మతులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు తూతూమంత్రంగానే మరమ్మతులు పనులు చేపట్టారని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు ఆరోపించారు. శనివారం జనసేన నాయకులతో కలిసి జియ్యమ్మవలస మండల పరిధిలోని రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ అభివృద్ధికి జైకా నిధులు సుమారుగా రూ.44 కోట్లు మంజూరయ్యాయని, అందులో రూ.7 కోట్లతో మరమ్మతులు చేశామని స్థానిక ఎమ్మెల్యే చెప్పుకుంటున్నారని తెలిపారు. పూర్తిస్థాయిలో పనులు కాకపోవడం వల్ల వట్టిగెడ్డ రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు సరైన సమయానికి నీరందలేదన్నారు. ఎడమ కాలువ పూడికతీత పనులను రైతులు సొంత డబ్బులతో చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే పనులు పునఃప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు వారణాశి శివకుమార్, కార్యదర్శి నేరేడుబిల్లి వంశీ, నాయకులు పెంట శంకరరావు, ఎల్.రంజిత్‌కుమార్, వి.రాజేష్ , గంటేడ భార్గవ పాల్గొన్నారు.

పిల్లల చదువు బాధ్యత తల్లిదండ్రులదే

ప్రజాశక్తి - కురుపాం

పిల్లల చదువుకు తల్లిదండ్రులే ప్రధాన బాధ్యత తీసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము పాఠశాలలో విద్యనందించడం ఒక ఎత్తు అయితే, తల్లిదండ్రులు పిల్లలను సకాలంలో పాఠశాలకు పంపి, హోంవర్క్ సక్రమంగా చేస్తున్నారో లేదో పరిశీలించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎండిఎం భోజనం బాగోలేక పిల్లలు సక్రమంగా తినడం లేదని తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించడానికి ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయున్ని నియమించామని ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులకు ఇకనుండి నాణ్యమైన భోజనాన్ని అందిస్తామని చెప్పారు.

గోపాలరావును సన్మానిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

గోపాలరావుకు సన్మానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అంబేద్కర్ గీతాన్ని రాసి మంచి ప్రజాదరణ పొందిన కె.డి.కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మల గోపాలరావును ఎంఆర్‌సి కార్యాలయంలో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతిభగల కవులు ఉండడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు దేవానంద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రసాద్, భగవాన్, బంటు సింహాచలం, హెచ్‌ఎం బిడ్డిక భీముడు, సిఆర్‌పిలు మాధవరావు, కామేశ్వరరావు, వాసు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బలిజిపేట

పెదపెంకి గ్రామంలో రెండు నిరుపేద కుటుంబాలకు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు తన మిత్రుల నుండి సేకరించిన రూ.12200ను శనివారం అందజేశారు. పెంకి కృపారావుకు రూ.7 వేలు, డర్రు సీతారాం కుటుంబానికి రూ.5200 అందించారు. కార్యక్రమంలో యువత అలబోను లక్ష్మణ్, పెంకి పరశురాం, గొర్లి శ్రావణ్, పల్లేడ తిరుపతి నాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న ఈర్ల సంజీవ్‌నాయుడు

NAME CHANGE

I **PICHUKA DIVYANJALI,** (Old Name), W/o, Dasari Harikrishna, House No: 1-44, Venkampeta Street, Palakonda, Srikakulam-532440. I Have Changed My Name as **PICHIKA DIVYANJALI** (New name) Here after My Name is known as **PICHIKA DIVYANJALI** for all purpose.